
కెండో వారియర్
MB
PUBLICATIONS
మధుబాబు

# కెండో వారియర్

(షాడో స్పై ఎడ్వంచర్)

రచన:

మధుబాబు

© Author
© Madhu Baabu
This digital book is published by -

కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

*All rights reserved.*

*No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.*

# కెండో వారియర్

చెమటలు పట్టిన ముఖాన్ని హేండ్ కర్చీఫ్‌తో తుడుచుకుంటూ బైంగన్ బజార్లోకి వచ్చాడు హెడ్ కానిస్టేబిల్ నట్వర్.

రెండు నిముషాలపాటు ఒక కరెంట్ పోల్ క్రింద నిలబడి మెల్లిగా అక్కడికి దగ్గర్లోనే వున్న చిన్న టీ బంక్‌లోకి పోయాడు.

"నట్వర్ సాబ్, ఇవ్వాళ చాలా యర్లీగా వచ్చేశారేమిటి? చీకటి పడటానికి వ్యవధి యింకా చాలా వున్నది కదా!!" మెల్లిగా అడిగేశాడు నోరు వూరుకోని పౌరుడు ఒకతను .

లైట్లులేని సైకిళ్ళను పట్టుకోవటమంటే నట్వర్ సాబ్‌కి నల్లేరుమీద బండి నడక. దొరికిన సైకిళ్ళను దొరికినట్లే ప్రక్కలకు లాగేసి పదో పరకో పట్టేయటం అతనికి మహాఇష్టం. అందుకే చీకటిపడిన తర్వాత తప్ప బైంగన్ బజార్లో ప్రత్యక్షం కాడు అతను.

"పగటి పూట కూడా ఖచ్చితంగా లైట్లు వుండితీరాలని రూలు వచ్చివుంటుంది. అందుకోసమే రెడీ అయిపోయాడు మన హెడ్డుగారు ..." సన్నగా అందుకున్నాడు మరో పౌరుడు.

ఎంత ప్రయత్నించినా ఆపుకోలేక బిగ్గరిగానే నవ్వేశారు అక్కడ వున్న కస్టమర్స్ అందరూ, నట్వర్ సాబ్‌వైపు ఓరగా చూస్తూ తనలో తను నవ్వుకున్నాడు టీ బంక్ ఓనర్ కూడా.

టొమాటో మాదిరి ఎర్రబడిన ముఖాన్ని హేండ్ కర్చీఫ్ వెనుక దాచుకుంటూ పళ్ళబిగువున కోపాన్ని అణుచుకున్నాడు నట్వర్.

అదే మరో సమయంలో అటువంటి డైలాగులు వినబడివుంటే కోపాన్ని అణుచుకుని వుండేవాడు కాదతను. అగ్గిరాముడిలా చిందులు తొక్కి, అక్కడ వున్న సైకిళ్ళనన్నిటినీ స్టేషన్‌కి తోలుకుపోయి ఎడాపెడా రాయించి వుండేవాడు కేసుల్ని.

అలా చేయటానికి వీలుపడని పరిస్థితి ఇప్పుడు అతనిది. పగటిపూట తను అక్కడికి వచ్చిన పని నెరవేరాలంటే అక్కడ వున్నవారి కో-ఆపరేషన్ చాలా అవసరం.

టీ బంక్ ఓనర్ అందించిన చాయ్‌ని సిప్ చేస్తూ పాంటు జేబులోనుంచి ఒక కార్డుసైజు ఫోటోని తీసి టేబిల్ మీద పడవేశాడతను.

"నిన్న సాయంకాలం గోరక్‌పూర్ సెంట్రల్‌జైలు నుంచి తప్పించుకున్నాడు ఈ ఫోటో లోని మనిషి. ఈ సెంటర్లో ఇటువంటి ముఖం ఏదైనా కనిపించిందా?" కనుచివరల నుంచి అక్కడి వారందర్నీ గమనిస్తూ అడిగాడు.

ఒకరి తరువాత ఒకరుగా లేచి ఆ ఫోటోని పరిశీలించి చూశారు అక్కడ వున్న కస్టమర్స్ అందరూ. పెదవులు విరుస్తూ ఎవరి స్థానాలకు వాళ్ళు వచ్చేస్తూ వుండగా వున్నట్లుండి కీచుగా అరిచాడు వారిలో ఒకతను.

"బాప్‌రే బాప్! బగ్గూసింగ్ ఇతను!! బందిపోటు బగ్గూసింగ్!!!" ఆశ్చర్యం, ఆందోళన నిండిన కనులతో నట్వర్ వైపు చూస్తూ అన్నాడు.

క్షణంలో మారిపోయింది అక్కడ జాయ్‌ఫుల్ వాతావరణం.

అంతవరకూ నవ్వుతూ తుళ్ళుతూ జోకులు వేసిన వారందరూ సీరియస్ అయిపోయారు. భరించరాని దుర్వార్త ఏదో చెవుల పడినట్లు. తమ చేతుల్లోని చాయ్ గ్లాసుల్ని వేగంగా ఖాళీచేసి ఒకరొకరుగా వెళ్లిపోవటం మొదలు పెట్టారు బయటికి.

మరో రెండు నిముషాలపాటు తను అక్కడ వుంటే బంక్ ఓనర్ కూడా జారుకుంటాడేమో అనే అనుమానం కలిగి తల విదిలించాడు నట్వర్ సాబ్.

వాళ్ళు అలా ఖంగారు పడిపోతున్నందుకు కోపం రాలేదతనికి, ఆశ్చర్యం కూడా కలగలేదు.

బందిపోటు బగ్రూసింగ్ పేరు చెపితే తడబడి పోతారు పెద్దపెద్ద పోలీసు అధికారులు కూడా. అష్టరాల్ మామూలు పౌరులు అలా భయపడటంలో ఏముంది వింత??

"ఎందుకైనా మంచిది రోడ్డుమీద ఒక కన్ను వేసి వుంచు భాయ్ ..." టీ బంక్ ఓనర్ వైపు చూస్తూ అన్నాడతను.

"ఇతన్ని పట్టుకున్న వారికి పెద్ద బహుమతిని ప్రకటించింది ప్రభుత్వం. ఇటువంటి ముఖం ఏదైనా ఇటుగా వచ్చిన మరుక్షణం కబురు పంపించు స్టేషన్‌కి. అవునో కాదో మేమే వచ్చి తేల్చుకుంటాం ..." అంటూ హెచ్చరించి రోడ్డుమీదికి వచ్చాడు. రెండు నిముషాలపాటు ఆ చుట్టుపట్లే తచ్చట్లాడి మెల్లిగా బయలుదేరాడు అక్కడికి దగ్గర్లోనే వున్న మరో బజారు వైపుకు.

అతను తమ వీధిని దాటి వెళ్ళిపోయాడని నమ్మకం చిక్కేవరకూ బంక్ ముందు భాగంలోనే బిజీగా పనులు చేసుకున్నాడు టీ దుకాణం యజమాని. నమ్మకం చిక్కగానే, తనను ఇతరులు ఇంకెవరూ పర్టిక్యులర్‌గా గమనించటం లేదని

నిశ్చయపరచుకొని బంకు వెనుక భాగములో కట్టబడిన చిన్న చెక్కల కట్టడంలోకి వెళ్ళాడు గబగబా.

ఆరు అడుగుల వెడల్పు, అంతే పొడవున్నది ఆ కట్టడం. అందులో వేసి వున్న దొంక చిరుగుల చాప.

ఆ చాపమీద ముడుచుకు పడుకుని వున్నది ఆరడుగుల ఆరంగుళాల పొడవుకల భారీ పర్సనాలిటీ ఒకటి.

చెక్కల కట్టడపు చిల్లుల తలుపు కదిలీ కదలడంతోటే చివ్వున లేచిందా పర్సనాలిటీ. తలక్రింద దాచి వుంచిన ఎనిమిది అంగుళాల పాట్నా పిడిబాకును పిడికిలిలో బిగించి పట్టుకుంటూ మోకాలిమీద నిలబడింది.

ఆ కట్టడంలోనే పడమటి గోడకు ఆనుకొని కునికిపాట్లు పడుతున్నది. నాలుగు అడుగుల నాలుగు అంగుళాలు మాత్రమే వుండే మరో చిన్న పర్సనాలిటీ. ఎటునుంచి ఎటువైపు లెక్కవేసినా నిండా ఏడు సంవత్సరాల వయస్సు కూడా వుండదు ఆ పర్సనాలిటీకి.

వయస్సును మించిన వేగంతో కదలిందది కూడా. మాసిపోయివున్న నిక్కర్ జేబులో నుంచి బయటికి లాగింది చిన్న చాకును. పళ్ళుకొరుకుతూ చేతిని పైకి ఎత్తి ముందుకు విసరబోయింది.

"అయ్యబాబోయ్.... నేను.... నేనే బగ్రూసాబ్.... నేనే...." ఖంగారుగా అంటూ వెనక్కి లాక్కున్నాడు టీ బంక్ ఓనర్ ముందుకు వేయబోతున్న పాదాన్ని.

# 2

"ఆగు బేటా.... ఆగు!!" ఖంగుమంటున్న కంఠంతో హెచ్చరించాడు బందిపోటు బగ్రూసింగ్ చాకును విసరబోతున్న చిన్న పర్సనాలిటీని.

ముందుకు కదులుతున్న కుడిచేతిని బలవంతంగా వెనక్కి లాక్కుంది ఆ పర్సనాలిటీ. చాకును క్రిందికి దించి ఎగ్రెసివ్‌గా చూసింది టీ బంక్ ఓనర్ ముఖంలోకి.

"తప్పు బేటా.... టీ బంక్ చాచా మనకు బాగా కావాల్సినవాడు. అతనిమీద కత్తి ఎత్తటం మహా తప్పు. క్షమాపణ చెప్పుకో...." గరగరమంటున్న కంఠంతో అన్నాడు బగ్రూసింగ్.

ముఖంలోని ఎగ్రెసివ్‌నెస్ మటుమాయం అవుతుండగా తల వంచుకుంది ఆ చిన్న పర్సనాలిటీ. చాకును ముడిచి నిక్కర్ జేబులోకి నెట్టేసింది.

"పాము చిన్నదే అయినా పడగ మహావేగంగా కదులుతోంది. ఇటువంటి కుమారుడిని కన్న మీరు అదృష్టవంతులు బగ్రూసాబ్.... నేను కూడా కన్నాను నలుగురు చవటల్ని.... అవటానికి మగవాళ్ళే అయినా చీకటిపడిన తర్వాత వంటరిగా బయటికి పోయే ధైర్యం ఒక్క వెధవకి కూడా లేదు...." బగ్రూసింగ్ కుమారుడైన ఆ చిన్న పర్సనాలిటీ వంక ఆప్యాయంగా చూస్తూ లోపలికి అడుగు పెట్టాడు బంక్ ఓనర్.

తల వంచుకొని అలాగే వుండిపోయిన కొడుకు భుజం చుట్టూ చేయిచుట్టి దగ్గిరికి లాక్కుంటూ చిన్నగా నవ్వాడు బగ్రూసింగ్.

"నీ మాటల్లో అసత్యం ఏమీ లేదు నేస్తం! నా జీవితంలో ఏదైనా మంచిపని అంటూ చేసివుంటే అందుకు ప్రతిఫలం ఈ జన్మలోనే లభించింది. ఎన్ని జన్మలెత్తినా

గుర్తుపెట్టుకోవాల్సిన సంతానాన్ని యిచ్చాడు భగవంతుడు. నా అంతటి అదృష్టవంతుడు మరొకడు వుండడని పరాయి వాళ్ళు అనటమే కాదు. నాకు నేనే అనుకుంటూ ఉంటాను. బహుశా నా దిష్టే తగిలింది కాబోలు.... చిందర వందర అయింది నా...." అంటుండగానే గద్గదమైంది అతని కంఠం.

"వద్దు బాబా.... వద్దువద్దని అంటుంటే మళ్ళీ మొదలు పెట్టారా??" అంటూ చివ్వున చేయి ఎత్తి అతని నోటిని మూశాడు కొడుకు.

రెండు వందల ఎనభై మంది కరుకు కసాయి పోలీసులు స్టెన్‌గన్స్ గుండెలకేసి గురిపెట్టి నిలుచున్నా చెక్కు చెదరని ధైర్యంతో రొమ్ము విరిచి నిలబడ్డ బగ్గ్రాసింగ్ కంఠం గద్గదమవటం చూసి పట్టరాని ఆశ్చర్యంతో తలమునకలై పోయాడు టీ బంక్ ఓనర్.

"ఏమయింది బగ్గ్రాసాబ్ ? అసలు ఏమయింది ??" కుతూహలంగా అడుగుతూ ముందుకు అడుగు వేస్తున్న అతనివంక చూసి, తండ్రికి సైగచేశాడు బగ్గ్రా కొడుకు తల అడ్డం తిప్పుతూ.

తన బాధను తనలోనే దాచుకుంటూ మరోసారి చిన్నగా నవ్వాడు బగ్గ్రాసింగ్.

"ఏమీ లేదు నేస్తం.... ఏదో బలహీనమైన అనుభూతికి లొంగిపోయి ఒక్క క్షణం వణికింది గొంతు.... నువ్వు తెలుసుకోదగినంత విశేషం అందులో ఏమీ లేదు.... కూర్చో మేరా దోస్త్.... తీరికగా కూర్చుని నువ్వు చెప్పదలుచుకున్నదేదో సావకాశంగా చెప్పు...." అంటూ కొంచెం ప్రక్కకు జరిగి చోటు ఇచ్చాడు చాపమీద.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=639**